రహదారుల నిర్బంధం

- నిబంధనలకు విరుద్ధంగా గడ్డి ట్రాక్టర్ల ప్రయాణం
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



గొల్లపాలెంలో రోడ్డుపై ప్రయాణిస్తున్న గడ్డి లారీని తప్పించుకుని ముందుకు వచ్చేందుకు అవస్థలు పడుతున్న రైతు

కాజులూరు: రహదారులపై నిబంధనలకు విరుద్ధంగా ఎండుగడ్డి లోడుతో యథేచ్ఛగా తిరుగుతున్న లారీలు, ట్రాక్టర్లు ప్రయాణికుల పాలిట మృత్యు శకటాలుగా మారుతున్నాయి. మితిమీరిన లోడుతో ఈ వాహనాల రోడ్డుపై వెళుతుంటే ప్రయాణికుల రాకపోకలకు అంతరాయం ఏర్పడటమే కాకుండా రోడ్డుపై విద్యుత్ వైర్లకూ, స్తంభాలకు వాహనాలు తగులుకోవటంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. నియోజకవర్గంలోని గొల్లపాలెం-కుయ్యేరు, యానం-ద్వారపూడి రహదారిలోనూ కాకినాడ-కోటిపల్లి ప్రధాన రహదారిలోనూ గడ్డి వాహనాల రాకపోకలు నిత్యకృత్యంగా మారుతున్నాయి. పరిమితికి మించిన పరిమాణంలో గడ్డిలోడు వాహనాలు రోడ్డుపై వెళ్తుంటే ఇతర వాహన చోదకులు పడరాని పాట్లు పడుతున్నారు. గతంలో రాత్రి సమయాల్లో రాకపోకలు సాగించే ఈ గడ్డిలారీలు, ట్రాక్టర్లు ఇటీవల పగటివేళల్లోనూ యథేచ్ఛగా తిరుగుతున్నాయి. వాహనాల రాకపోకలు రద్దీగా ఉండే సమయాల్లోనూ గడ్డివాహనాలు తిరగడం వలన ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పలువురు వాపోతున్నారు. రామచంద్రాపురం నియోజకవర్గం వ్యవసాయ ఆధారిత గ్రామాలు కావటంతో ఇక్కడ నుంచి కాకినాడ తదితర పట్టణాలకు ఎండుగడ్డి రవాణా ఎక్కువగా జరుగుతుంది. లారీ, ట్రాక్టర్ వంటి వాహనాలకు ఇరువైపులా ఎత్తుగా ఎండుగడ్డి లోడు చేయడం వలన వాహనం సైజు భారీగా మారి రోడ్డు ఆక్రమిస్తూ ప్రయాణిస్తున్నాయి. గడ్డి వాహనాలు రోడ్డుపై వెళుతుంటే మోటారుసైకిళ్లు, సైకిళ్లపై వెళ్లే వారికి ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక తప్పించుకు ముందుకు వెళ్లేందుకు వీలు లేకుండా పోతుందని దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రయాణికులు చెబుతున్నారు. అంతేకాకుండా ఈ వాహనాలు రోడ్డుపై ప్రయాణించే సమయంలో పైన విద్యుత్ వైర్లకు తగులుకుని మంటలు సంభవించడం, లేదా ఈ వాహనాలు మలుపులు తిరగలేక విద్యుత్ స్తంభాలను ఢీకొనటం తరచూ జరుగుతున్నాయి. గతేడాది వేసవిలో కోలంక వద్ద గడ్డి ట్రాక్టర్ ఒకటి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టగా అది విరిగి ముక్కలై నేలపై పడింది. ఆ సమయంలో గ్రామంలో విద్యుత్ సరఫరా లేకపోవటంతో రోడ్డుపై వెళుతున్న ప్రయాణికులకు త్రుటిలో ఘోర ప్రమాదం తప్పింది. ఇటీవల గొల్లపాలెంలో రోడ్డుపై వెళుతున్న గడ్డి ట్రాక్టర్‌కి పైన విద్యుత్ వైర్లు తగులుకుని మంటలు సంభవించగా స్థానికులు గమనించి సకాలంలో ఆర్పేశారు. అధికారుల కళ్లముందే నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రయాణికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిసున్న గడ్డి ట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రహదారులను ఆక్రమించుకుంటున్నాయి



లారీ, ట్రాక్టర్ వంటి వాహనాలకు మితిమీరిన లోడుతో ఎత్తుగా ఎండుగడ్డిని లోడు చేస్తున్నారు. వాహనం సైజు భారీగా మారి రోడ్డు ఆక్రమిస్తూ ప్రయాణిస్తున్నాయి. ఇవి ముందు వెళుతుంటే ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాల పాలవుతున్నాం.

– పెంకే సత్యనారాయణ, ప్రయాణికుడు, కాజులూరు

భయాందోళనకు గురవుతున్నాం



మితిమీరిన లోడుతో ఎండుగడ్డి వాహనాలు రోడ్లపైకి వస్తుంటే భయాందోళనలకు గురవుతున్నాం. గ్రామాల్లో విద్యుత్ లైన్లు కిందికి వేలాడుతుంటాయి. అవి గడ్డివాహనాలకు తగులుకుని తరచూ మంటలు సంభవిస్తున్నాయి.

– పితాని సత్యనారాయణ, రైతు, తణుకువాడ

కేసులు పెడుతున్నాం



పరిమితికి మించిన లోడుతో రోడ్లపై ప్రయాణించే వాహనాలకు జరిమానాలు విధిస్తున్నాం. కొన్ని సందర్భాల్లో కేసులు నమోదు చేసి కోర్టుకు పంపిస్తున్నాం. ప్రయాణికులకు ముందు వెళ్లే వాహనంతో ఇబ్బంది కలిగినట్టు అనిపిస్తే పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేయవచ్చు.

– ఎం.తులసీరామ్, ఎస్సై, గొల్లపాలెం

క్లుప్తంగా

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్



విజయం సాధించిన కె.గంగవరం టీం

కె.గంగవరం: గత వారం రోజులుగా నిర్వహించిన నలమాటి సాయిరామ్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ నేటితో ముగిసింది. ఈ టోర్నమెంట్‌లో 12 గ్రామాలకు చెందిన టీంలు పాల్గొనగా ఫైనల్ మ్యాచ్‌లో కె.గంగవరం, సత్యవాడ టీంలు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో కె.గంగవరం టీం విజయం సాధించి టోర్నీ విజేతగా నిలిచింది. మొత్తం టోర్నమెంట్‌లో ఉత్తమ బౌలర్, మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్, ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా కె.గంగవరం గ్రామానికి చెందిన కూర్మా రాజ శేఖర్ నిలవగా, బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా కోటిపల్లి నరేంద్ర నిలిచారు. విజయం సాధించిన వారు గ్రామ పెద్దలు దొరబాబు, అబ్బు తదితరులు చేతుల మీదుగా టీం కెప్టెన్ సాయికృష్ణ ఇతర సభ్యులు కప్‌ను అందుకున్నారు.

విద్యా కార్యక్రమాలపై సమీక్ష

కొత్తపేట: ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న విద్యాపరమైన కార్యక్రమాలపై సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు పి.రాంబాబు, బీవీవీ సుబ్రహ్మణ్యం, డి.రమేష్ బాబు, డాక్టర్ ఎంఏకే భీమారావులు సమీక్ష నిర్వహించారు. కొత్తపేట మండల విద్యాశాఖ కార్యాలయంలో గురువారం సీఆర్‌ఎంటీలకు రివ్యూ సమావేశాన్ని నిర్వహించారు. ఎంఈఓ-2 కె.లీలావతి అధ్యక్షతన జరిగిన సమీక్షలో ఏఎంఓ పి.రాంబాబు, సీఎంవో బీవీ సుబ్రమణ్యం, ఆల్టర్నేటివ్ స్కూల్స్ కోఆర్డినేటర్ డి.రమేష్ బాబు, ఏపీఓ డాక్టర్ ఎంఏకే భీమారావులు మాట్లాడుతూ ముఖ్యంగా సీఆర్‌ఎంటీలు క్షేత్ర స్థాయిలో విద్యాపరమైన కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. విద్యార్థులు 2.0 నందు ప్రతి పాఠశాల ఎన్‌రోల్ అయ్యే విధంగా చూడాలని అలాగే ప్రభుత్వ పాఠశాలలకు అందజేసిన లైబ్రరీ పుస్తకాలను ఆన్‌లైన్ చేయాలని ఫిర్కి యాప్‌లో టీపీడీ మాడ్యూల్స్ సంబంధిత ఉపాధ్యాయులు పూర్తి చేసే విధంగా సీఆర్‌ఎంటీలు బాధ్యతలు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రస్తుతం విద్యాశాఖలో అమలవుతున్న పథకాలు, కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో కొత్తపేట, ఆలమూరు, ఆత్రేయపురం, పి.గన్నవరం, రావులపాలెం, అయినవిల్లి మండలాలకు చెందిన సీఆర్‌ఎంటీలు పాల్గొన్నారు.

చిరుధాన్యాల ఉత్పత్తిపై అవగాహన

అయినవిల్లి: మార్టేరు వరి పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో చిరుధాన్యాల ఉత్పత్తిపై గురువారం అవగాహన కార్యక్రమం మండలంలోని మాగాంలో నిర్వహించారు. మార్టేరు వరి పరిశోధన కేంద్రం అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రిసెర్చ్ భరతలక్ష్మి, సైంటిస్ట్ సుధీర్, పెద్దాపురం, ముమ్మిడివరం ఏరువాక కేంద్రం నుంచి వి.గౌరీ, బి.భవానీల ఆధ్వర్యంలో రైతులకు చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. భరతలక్ష్మి చిరుధాన్యాల ఉత్పత్తులపై ఇప్పుడు మంచి గిరాకీ ఉందని రైతులు వీటి సాగుపై మెళకువలు తెలుసుకోవాలన్నారు. చిరుధాన్యాల సాగుతో మంచి ఆదాయం సమకూర్చుకోవచ్చన్నారు. నేటి యువతరం రైతులు చిరు ధాన్యాలను సాగు చేయాలని ఆమె కోరారు. రబీ సీజన్‌లో చిరుధాన్యాల సాగు అనుకూలమన్నారు. చిరుధాన్యాలను ఆశించే చీడ పీడలపై యాజమాన్య పద్ధతులు, సాగులో మెళకువలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సైంటిస్టులు ప్రదీప్‌కుమార్, జిల్లా వనరులు శాఖ ఏడీఏ ఎ.రాజశేఖర్, ఏఓ మనోహర్, ఏడీఏ ఎంఏ శంషీ, ఏవో శోభ, రైతు సంఘ నాయకులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి

అంబాజీపేట: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి కోరారు. అంబాజీపేట ఎంపీపీ కార్యాలయంలో ఈఓపీఆర్డీ బి.మమత అధ్యక్షతన గ్రామాభివృద్ధి ప్రణాళిక తయారీపై సర్పంచ్‌లకు, ఎంపీటీసీలకు, పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఎంపీపీ, జెడ్పీటీసీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అనంతరం గ్రామ పంచాయతీల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై ఈఓపీఆర్డీ మమత, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీపతిలు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, ఎంపీటీసీల మండల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, సర్పంచ్‌లు కోట బేబిరాణి, నాగాబత్తుల శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

అంబాజీపేట: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేయించాలని సర్పంచ్ కోట బేబీరాణి అన్నారు. చిరతపూడిలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను గురువారం ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పశువులకు వ్యాక్సిన్ వేయించాలన్నారు. కార్యక్రమంలో గుత్తుల వెంకటేశ్వరరావు, వెటర్నరీ అసిస్టెంట్ బి.ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

రానున్న ధర్మయుద్ధంలో వైఎస్సార్ సీపీదే గెలుపు

నియోజకవర్గ కోఆర్డినేటర్ సూర్యప్రకాశ్



కాజులూరు మండల కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్

కాజులూరు: రానున్న ధర్మయుద్ధంలో మరోసారి వైఎస్సార్ సీపీ గెలుపొందడం ఖాయమని రామచంద్రపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. గురువారం కాజులూరులో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదవాడు కూడు, గూడు, నీడకు లోటు లేకుండా హాయిగా బతకాలంటే మరోసారి జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రానికి సీఎం కావాలన్నారు. ఆ దిశగా స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ప్రజా సంక్షేమానికి అనుగుణంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మంచి, మంచి పథకాలను రూపొందించడమే కాకుండా దళారుల ప్రమేయం లేకుండా నేరుగా వాటిని లబ్ధిదారులకు అందజేయటంలోనూ సఫలీకృతులయ్యారన్నారు. వలంటీర్ వ్యవస్థ అందుకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. గతంలో ప్రతి చిన్న పనికి జిల్లా కలెక్టరేట్, మండల పరిషత్ తదితర కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని జగనన్న సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి అన్ని శాఖల అధికారులను స్థానికంగానే అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. గతంలో అర్హులకు పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీల సిఫారసులు ఉండాల్సి వచ్చేదన్నారు. జన్మభూమి కమిటీల రూపంలో ఉన్న దళారులు ముడుపులు తీసుకుని వారికి నచ్చిన వారికే పథకాలు ఎంపిక చేసేవారన్నారు. జగనన్న పాలనలో పథకాలన్నీ పారదర్శకంగా నిజమైన అర్హులకే అందుతున్నాయన్నారు. ఇంత చక్కటి పాలన నిరంతరం అందాలంటే రాష్ట్రానికి జగనే మరలా సీఎం కావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాత భారతి, మురళి, జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు, మండలంలోని 26 గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ చైర్మన్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులకు ప్రాధాన్యమివ్వాలి

కాజులూరు: సేద్యంలో సేంద్రియ ఎరువుల వాడకానికి రైతులు ప్రాధాన్యమివ్వాలని మండల వ్యవసాయ అభివృద్ధి కమిటీ చైర్మన్ గుత్తుల బుల్లిరాజు అన్నారు. గురువారం మండలంలోని శలపాకలో ఆయన రైతులతో మాట్లాడుతూ రసాయన ఎరువుల రేట్లు రోజురోజుకీ పెరిగిపోతుండటంతో పంటల సేద్యంలో వ్యయాలు అధికమవటమే కాకుండా పంట ఉత్పత్తులు విషతుల్యమై అంతర్జాతీయ మార్కెట్‌లో నాణ్యత లోపించే ప్రమాదం ఉందన్నారు. విత్తనశుద్ధికి జీవామృతం వినియోగం, సస్యరక్షణకు గోవు పేడ, గోమూత్రం, కషాయం వంటివి తయారు చేసి పంటలకు సోకే పలురకాల తెగుళ్లపై వినియోగించవచ్చన్నారు. రైతులకు సేంద్రియ ఎరువుల వాడకంపై అవగాహన కల్పించేందుకు వ్యవసాయశాఖ అనేక అవగాహన కార్యక్రమాలు, క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహిస్తున్నామన్నారు. వాటిని రైతులు సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించాలన్నారు. కార్యక్రమంలో తణుకువాడ పీఏసీఎస్ చైర్మన్ పితాని సుబ్రహ్మణ్యం, మాజీ సర్పంచ్‌లు వాసంశెట్టి శ్రీనివాస్, దెయ్యాల వెంకటరమణ, స్థానిక రైతు సంఘం నాయకులు నున్న లక్ష్మణరావు, పోలినాటి సూర్యచంద్రం, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ జాతర

కె.గంగవరం: మండలంలోని యండగండిలో కొలువైన గ్రామ దేవత ముత్యాలమ్మ వారి జాతర, తీర్థాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. జాతర సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. బుధవారం రాత్రి ఆలయం వద్ద బుట్టబొమ్మలు, కోయ డ్యాన్సులు, గరగ నృత్యాలతో జాతర నిర్వహించారు. అనంతరం గురువారం ఆలయం నిర్వహించిన తీర్థంలో గ్రామస్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

జనసేన, టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక



వైఎస్సార్ సీపీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం: మండలంలోని కేదారిలంక గ్రామానికి చెందిన పలువురు జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సమక్షంలో గురువారం వైఎస్సార్ సీపీలోకి చేరారు. మండపేట పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వారికి పార్టీ కండువాలు కప్పి, సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో యర్రంశెట్టి సత్యనారాయణ, శ్రీనివాసరావు, అన్యం త్రిమూర్తులు, బైరిశెట్టి చిన్న, శ్రీనివాసరావు, నాని, పెద్దిరెడ్డి సత్యనారాయణ, రంకిరెడ్డి బ్రహ్మాజీ తదితరులు ఉన్నారు. పేదలకు సంక్షేమాన్ని అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో.. పార్టీలో ఉంటూ సేవలందిస్తున్న వారికి ప్రజల్లో విశేష ఆదరణ ఉంటుందని ఎమ్మెల్సీ తోట అన్నారు. సంక్షేమాన్ని క్షేత్ర స్థాయిలో అందజేసేందుకు కార్యకర్తలు కార్యోన్ముఖులు కావాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వీధి వెంకటరెడ్డి, ఎంపీటీసీ యర్రంశెట్టి నాగేశ్వరరావు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పోలిశెట్టి గణేష్, నాయకులు పోలిశెట్టి బ్రహ్మయ్య, యర్రంశెట్టి నాగేంద్ర పాల్గొన్నారు.

ప్రతిభ వెలికితీసేందుకే క్రీడలు



ముక్తేశ్వరంలో క్రికెట్ క్రీడాకారులతో ఎంపీడీఓ శ్రీవెంకటాచార్య

అంబాజీపేట: యువతీ, యువకుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి అన్నారు. 'ఆడుదాం ఆంధ్ర'లో భాగంగా అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన కబడ్డీ పోటీలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి క్రీడాకారుడు గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత, మట్టపర్తి యజ్ఞశ్రీ వెంకటేశ్వరరావు, చింతపల్లి వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ కె.సత్యనారాయణ, ఎంఈఓలు కె.వెంకటేశ్వరరావు, ఎం.ప్రకాష్, హెచ్‌ఎం కడలి సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరులో..

ఆలమూరు: రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. మండలంలోని చొప్పెల్ల, మూలస్థాన అగ్రహారం గ్రామాల్లోని మైదానాల్లో ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ నేతృత్వంలో క్రికెట్ పోటీలు జరిగాయి. ఈ పోటీలకు 24 జట్లు ప్రాతినిథ్యం వహిస్తుండగా తొలి రోజు నిర్వహించిన ఈ పోటీల్లో నాలుగు మ్యాచ్‌లు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అయినవిల్లి: మండలంలోని ముక్తేశ్వరం జెడ్పీ హైస్కూల్, ముక్తేశ్వరం బీఈడీఓ కళాశాలలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో క్రికెట్ పోటీలను ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య గురువారం ప్రారంభించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ క్రీడలపై ప్రతి యువకుడు ఆసక్తి కనబరిచాలన్నారు. యువత క్రీడాస్ఫూర్తి కలిగి ఉండాలన్నారు. క్రీడలతోనే మానసికోల్లాసం అలవడుతోందన్నారు. గ్రామీణ క్రీడలను ముందుకు తీసుకెళ్లాలన్నారు. ప్రభుత్వం ఇటువంటి కార్యక్రమాల ద్వారా క్రీడలపై ఆసక్తి పెరుగుతోందన్నారు. కార్యక్రమంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, వ్యాయామోపాధ్యాయులు, పంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

సామాజిక న్యాయానికి జగన్ పాలన ప్రతీక

కపిలేశ్వరపురం: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశించిన సామాజిక న్యాయానికి ప్రతీకగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగుతోందని కపిలేశ్వరపురం, మండపేట మండలాలకు చెందిన పలువురు దళిత, మైనారిటీ వర్గాల నాయకులు గురువారం ఇక్కడ పేర్కొన్నారు. విజయవాడలో 125 అడుగుల అంబేడ్కర్ కాంస్య విగ్రహంతో కూడిన స్మృతివనం ప్రారంభోత్సవం నేపథ్యంలో వారు ఆనందం వ్యక్తం చేశారు. మండపేటకు చెందిన రాష్ట్ర షేక్ అండ్ షేక్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ ఆలీ బాబా ఖాన్, కపిలేశ్వరపురం మండల పరిషత్ విప్ పలివెల మధు, వైఎస్సార్ సీపీ దళిత నాయకులు నక్కా సింహాచలం, పాలింగి కృష్ణకిశోర్, ఏలేటి గంగరాజు, పిప్పర సంపతరావు, దాసి రాంజీ అంబేడ్కర్, పాలింగ్ శ్రీనివాస్ తదితరులు హర్షం ప్రకటించారు. సంక్షేమ పథకాలతో సామాజిక న్యాయాన్ని అమలు చేయడంతో పాటు, ప్రధాన కూడలిలో దేశంలోనే ఎత్తయిన విగ్రహాన్ని నెలకొల్పడం సామాజిక న్యాయానికి ప్రతీక అన్నారు. అంబేడ్కర్ విగ్రహంపై విపక్షాలు చేస్తున్న వ్యాఖ్యలు సామాజిక న్యాయంపై వారి వైఖరికి నిదర్శనమన్నారు.

మండపేటను తూర్పుగోదావరిలో విలీనం చేయాలి

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేయాలని ఆ ప్రాంతానికి చెందిన పలువురు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు త్వరలో ఐక్య కార్యాచరణతో ముందుకు సాగుతామని మండపేటలోని కామాక్షి కల్యాణ మండపంలో గురువారం నిర్వహించిన సమావేశంలో నాయకులు వెల్లడించారు. నాయకులు దూళి జయరాజు, బీజేపీ కోన సత్యనారాయణ, కోటిపల్లి వి సాయి కుమార్ మాట్లాడుతూ తమ డిమాండ్‌ను ఈ నెల 20న మండపేటకు రానున్న మాజీ సీఎం చంద్రబాబు ముందు ఉంచుతామన్నారు.